శిథిలావస్థలో వంతెన

- భారీ వాహనాల రాకపోకలతో దెబ్బ తింటున్న నిడమానూరు వంతెన
- రెయిలింగ్ ధ్వంసం, గోడలకు బీటలు
- వంతెన సమీపంలో అసాంఘిక కార్యకలాపాలు

రామవరప్పాడు: రైవస్ కాలువపై నిడమానూరు వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. అప్పట్లో కాలిబాట అవసరాలకు, వ్యవసాయ ఉత్పత్తులను ఎడ్ల బండ్లలో తరలించడానికి దీన్ని నిర్మించారు. ప్రస్తుతం వంతెన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన పిల్లర్లు, రెయిలింగ్ దెబ్బతిని పగుళ్లు ఏర్పడ్డాయి. పైగా జాతీయ రహదారి నుంచి గ్రామం వెలుపలికి వచ్చే ఆర్టీసీ బస్సులు ఈ వంతెనపై మీదగా మలుపు తిరిగి గన్నవరం, ఏలూరు వైపుగా వెళ్తుంటాయి. వీటి రాకపోకలతో మరింతగా బలహీనమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా వంతెన ఇరుకవ్వడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఫలితంగా వాహనాలు బారులు తీరుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. వంతెన దిగువన ఉన్న రైల్వే గేట్ పడినప్పుడు పరిస్థితి మరింత జటిలంగా మారుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇనుపచువ్వలు బయటకొచ్చి..

బ్రిటీష్ కాలంలో నిర్మించినది కావడంతో వంతెన పరిస్థితి దారుణంగా మారింది. వంతెనకు రెండు వైపులా ఉన్న రెయిలింగ్ దెబ్బతిని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన కింద భాగంలో నెర్రెలిచ్చి క్రమేణా పెచ్చులు ఊడిపోతు బలహీనంగా మారుతోంది. దీన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.





ప్రమాదకరంగా నిడమానూరు వంతెన (ఇన్‌సెట్) పెచ్చులూడి బీటలు వారుతున్న వంతెన దిగువ భాగం

జాతీయ రహదారి మీదగా మళ్లించాలి

వంతెన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామం వెలుపలికి వచ్చే సిటీ బస్సుల రూట్‌ను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ రహదారి నుంచి వచ్చే సిటీ బస్సులు వంతెన సెంటర్ వద్ద మలుపు తిప్పి మళ్లీ జాతీయ రహదారి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు. భారీ వాహనాలను కూడా వంతెనపైకి అనుమతించకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టేది.?

వంతెన పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వంతెన సమీపంలో పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఘర్షణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి పారుదల లేని సమయంలో కొందరు వంతెన కింద జూదాలాడటం, మద్యం, గంజాయి సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. వీరి చేష్టలకు భయపడుతున్న మహిళలు, విద్యార్థినులు వంతెన సమీపంలోని బస్టాప్ నుంచి రాత్రుళ్లు ఇంటికి వెళ్లడానికి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు ఈ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలోని గోదాముకు వచ్చే భారీ వాహనాలు కూడా ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలకు ప్రవేశం లేదని గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పట్టించుకోవడం లేదు. రైల్వేగేటు పడినపుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వంతెన పైనే వాహనాలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకుంటోంది. ఏ ప్రమాదం జరగక ముందే సత్వరగా కొత్త వంతెన నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది.

– మహమ్మద్ ఇస్మాయిల్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు, నిడమానూరు

రూరల్‌లో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని 8 గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న, పాతపాడు, విలేజ్ కండ్రిక, కొత్తూరు తాడేపల్లి, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ధాన్యం క్వింటా ఏ గ్రేడ్ రూ.2,330, సాధారణ రకం రూ.2,300కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి దాన్యం విక్రయిస్తే రెండు రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తారని పేర్కొన్నారు. హమాలీలు, రవాణా చార్జిలన ప్రభుత్వం చెల్లిస్తుందని, గోనెసంచులు కూడా ప్రభుత్వమే ఏర్పాటుచేస్తారని పేర్కొన్నారు.

సూరంపల్లిలో సీపీఎం మహాసభ

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో మంగళవారం సీపీఎం మండల 8వ మహాసభ జరిగింది. ఆ పార్టీ నాయకుడు బడుగు బాలమ్మ, తాతబ్బాయి అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన మద్యం కంటే మంచి సరుకులు తక్కువ ధరకు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఇసుక ధరలు అందుబాటులో లేకపోవటం, విచ్చలవిడిగా మద్యం షాపులు, బెల్టు షాపులు, కార్మికులకు పనులు లేకపోవటం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మణస్వామి, కళ్ళం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి రామాపురం కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఆపరేషన్స్ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనమలూరు సెంటర్, రామాపురం కాలనీ, డొంకరోడ్డు, ప్రభునగర్, సాలిపేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

క్షేత్ర సందర్శనతో విషయ పరిజ్ఞానం



ఉయ్యూరు: క్షేత్రస్థాయి సందర్శనలతో విద్యార్థులకు సమగ్ర విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ఎంకే విద్యాసంస్థల అధినేత ఎంకే బాబు అన్నారు. క్షేత్రసందర్శనలో భాగంగా పాఠశాల విద్యార్థులు మంగళవారం ఉయ్యూరు పట్టణ పోలీస్‌స్టేషన్, రైతుబజార్, రిలయన్స్ మార్ట్‌లను సందర్శించారు. ఎంకే బాబు మాట్లాడుతూ సమాజంలో వాస్తవ పరిస్థితులు, వ్యవస్థల పనితీరు, ప్రజాజీవనం అంశాలపై అవగాహన కల్పించడానికి క్షేత్ర సందర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళలు పెంచడం దారుణం

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్



గన్నవరం: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పని వేళలను పెంచడం దారుణమని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పనివేళలు పెంచడానికి పైలెట్ ప్రాజెక్ట్‌గా చేయడం.. మానవ మేధస్సును చిదిమి వేసే ప్రక్రియగా పేర్కొన్నారు. పనివేళల పెంపును ఉపాధ్యాయులకు తెలియజేయకుండా, రహస్య అజెండాతో ముందుకెళ్లడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనివేళలు పెంచుతూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నేతలు రావెళ్ల ఆనంద్‌కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం



కంకిపాడు: విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం కావాలని ఎంఈఓ-1 బీవీ శేషగిరిరావు, ఎంఈఓ-2 కేవీస్వీ ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. క్రీడల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉయ్యూరు జెడ్పీపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ రమణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గోసాల క్రీడాకారుడి సత్తా



పెనమలూరు: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో గోసాలకు చెందిన క్రీడాకారుడు సత్తా చాటాడు. పంజాబ్ పాటియాలలో ఈ నెల 15న జాతీయ స్థాయి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -2024 పోటీల్లో గోసాలకు చెందిన మహ్మద్ ఈసూబ్ అలీ ప్రతిభ చాటి బహుమతి గెలిచాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు క్రీడాకారుడిని అభినందించారు.

నేడు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై వర్క్‌షాప్

కంకిపాడు: సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు గొల్లగూడెం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ డి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్సీఎం పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కులు, చట్టాలు, బాధితులకు అందిస్తున్న సాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పూర్తి అవగాహనతో రైతులకు గిట్టుబాటు ధర

పెనమలూరు: ధాన్యం అమ్మకాలకు ప్రభుత్వ మార్గదర్శకాలపై రైతులు పూర్తి అవగాహనతో గిట్టుబాటు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి చెప్పారు. గోసాల, వణుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మంగళవారం రైతులకు పలు సూచనలు చేశారు. పద్మావతి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం అమ్మకాల విషయంలో మార్గదర్శకాలు, ప్రమాణాలు తెలుసుకోవాలన్నారు. దీనిపై రైతు సేవా కేంద్రాల్లో పూర్తి సమాచారం ఉంచటమే కాకుండా రైతులకు అవగాహన పెంచడానికి గ్రామాల్లో బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ప్రారంభిస్తామన్నారు. రైతులు రబీలో వరి సాగు కాకుండా మొక్కజొన్న, మినుము, వంటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.రైతులు సబ్సిడీపై టార్పాన్లు, స్ప్రేయర్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.శైలజ, వీఏఏలు కిరణ్మయి, చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (ఘంటసాల)శాస్త్రవేత్త డి.సుధారాణి అన్నారు. పెద్ద అవుటపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి కోతల దశలో ఉన్నాయని, వరి మాగాణిలో మినుము, పెసర విత్తనాల చల్లే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసీ చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ ఉయ్యూరు శాస్త్రవేత్త జె.శైలజారాణి, ఏవో హరీష్ కుమార్, ఏఈవో దుర్గా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోసాలలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



సూరంపల్లిలో ఉద్యాన పంటలు పరిశీలిస్తున్న జిల్లా అధికారి జ్యోతి

గన్నవరం రూరల్: ఉద్యాన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి చెప్పారు. మంగళవారం మండలంలోని సూరంపల్లి, గొల్లనపల్లి గ్రామాల్లో కొత్తగా వేసిన మామిడి, బొప్పాయి పంటలు ఆమె పరిశీలించారు. మండల హార్టికల్చర్ అధికారి హరిచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరపనేనిగూడెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి వై.రజని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో చిన్నారుల జీవితం ఛిద్రం

కంకిపాడు: సామాజిక మాధ్యమాలతో చిన్నారుల జీవితం ఛిద్రంగా మారుతోందని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సామాజిక మాధ్యమాలు-బాలలపై ప్రభావం అంశంపై చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. జాకబ్‌రాజు మాట్లాడుతూ చిన్నా, పెద్దా తేడా లేకుండా సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారన్నారు. హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ఎన్‌డీ సత్యవతి, పద్మజరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.విజయ సూచించారు. మంగళవారం నున్న జెడ్పీ హైస్కూల్లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మాదక ద్రవ్యాలు -ఆరోగ్యం పై ప్రభావం అనే అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.దేవమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న పునాదిపాడు పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కంకిపాడు: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని అతిథులు ఆకాంక్షించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేశారు. కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి చేశారు. జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్ఎంలు రోజ్‌మేరీ, శివకుమారి, గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడంతో పాటుగా మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు జె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిన్నరాజు, స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు, ముదునూరు గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, గ్రంథాలయాధికారులు రమణి, నాగరాజు పాల్గొన్నారు.



తెన్నేరులో రంగవల్లుల పోటీల్లో విద్యార్థులు



ముదునూరులో రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో, ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యాన విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు.

పెనమలూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తొలుత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు చేశారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి పి.హరీష పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అభయాంజనేయుడికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు పొట్ల వెంకట రత్నం, శ్యామలాదేవి దంపతుల (నూజివీడు) సహకారంతో ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జనవరి 1 నుంచి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ఉయ్యూరు: ప్రభుత్వ పెన్షనర్లు వార్షిక ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్‌లు) నిర్ణీత గడువు లోపు మాత్రమే సమర్పించాలని ఉయ్యూరు ఉప ఖజానాధికారి ఆకూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనవరి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే సర్టిఫికెట్లను అందించాలని సూచించారు.

కమ్యూనిస్టు యోధుడు రామచంద్రరావు

పెనమలూరు: కమ్యూనిస్టు యోధుడు చాగంటిపాటి రామచంద్రరావని సీపీఐ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జెల్లి విల్సన్ అన్నారు. పెనమలూరులో చాగంటిపాటి రామచంద్రరావు(80) మంగళవారం మృతి చెందటంతో ఆయన భౌతిక కాయానికి విల్సన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ ఆయన మరణం పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నార్ల వెంకటేశ్వరరావు, పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు పాల్గొన్నారు.

నాగేంద్రహారాయ త్రిలోచనాయ..



యనమలకుదురులో స్వామివారికి కుంభాభిషేకం చేస్తున్న దృశ్యం



రుద్రహోమం చేస్తున్న వేద పండితులు

పెనమలూరు: నాగేంద్రహారాయ త్రిలోచనాయ అంటూ భక్తజనం ముక్కంటిని స్తుతించారు. యనమలకుదురులోని శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం 'ఆరుద్ర' సందర్భంగా ఉదయం 5 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివారికి ఉదయం 6.30, 8.30 గంటలకు అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు చేసి మహాకుంభాభిషేకం చేశారు. ఆలయంలో శ్రీపార్వతీదేవికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఈఓ ఎన్.భవాని తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి అన్నంతో వైభవోపేతంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు ఐదువేలమంది భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కమిటీ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, నక్కా బాబు, షేక్ సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అన్నపూర్ణాదేవిగా ప్రత్యేక అలంకరణ

రామవరప్పాడు: రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ ప్రాంగణంలో మాజీ జెడ్పీటీసీ కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో కార్తిక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద అభిషేకాలు చేశారు.

విశ్వేశ్వరుడి సన్నిధిలో రుద్రయాగం

గన్నవరం: కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా నిత్య అభిషేకాలు నిర్వహించారు. పచ్చకర్పూరంతో స్వామివారిని అలంకరించారు. అనంతరం కాట్రగడ్డ రామశేషు దంపతుల ఆధ్వర్యంలో రుద్ర హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద అప్రమత్తం



ఉంగుటూరు వద్ద ప్రమాదకర మలుపు




తేలప్రోలు వద్ద



గారపాడు వద్ద రోడ్డు మీదకు వచ్చిన ముళ్ల చెట్టు కొమ్మలు

ఉంగుటూరు: తేలప్రోలు-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై మలుపులు ప్రమాదాలకు చిరునామాగా మారాయి. వాహనచోదకులకు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపైకి ముళ్ల చెట్ల కొమ్మలు రావడంతో మార్గం మూసుకుపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. పలువురు ప్రమాదాలకు గురై మృతి చెందిన సందర్భాలున్నాయి. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు ఒకదానికొకటి కనిపించడంలేదు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, రోడ్డును కమ్మేసిన ముళ్ల చెట్లను తొలగించి ప్రమాదాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

దొంగ దొరికాడు



పెనమలూరు: పోరంకిలో పట్టపగలే దొంగ వృద్ధురాలి పీక నొక్కి ఆమె బంగారు ఆభరణాలు చోరీచేయబోయి స్థానికులకు చిక్కాడు. దొంగను స్తంభానికి కట్టి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే పోరంకి బందరు రోడ్డు పక్కనే తోటకూర వారి వీధిలో చక్క కస్తూరి బాయ్ అనే వృద్ధురాలు ఉంటుంది. ఆమె ఒంటరిగా ఉందని గమనించిన యనమలకుదురుకు చెందిన అమరపు మల్లేశ్వరరావు ఆమె ఇంట్లోకి ప్రవేశించి కత్తితో బెదించి ఆమె పీక నొక్క బంగారు ఆభరణాలు చోరీ చేయపోయాడు. ప్రాణభయంతో వృద్ధురాలు కేకలు వేసింది. అదే సమయంలో డెలివరీ బాయ్ రావడంతో పారిపోతున్న దొంగను పట్టుకున్నాడు. స్థానికులు దొంగను స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పట్టపగలే దొంగ ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని చంపే యత్నం చేయడం స్థానికంగా కలకలంరేపింది.

